

# అద్దం కూడా అబద్ధం ఆడుతుంది

ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి

నిలువుటద్దం ముందు నిటారుగా నిలబడి కళ్లార్పుతూ ఆలోచనగా తనను తాను అట్టే పరీక్షగా చూసుకుంటోంది సునీత

'అమ్మాయికి పాటలేమన్నా వచ్చా అండి.... '

ఉలిక్కిపడింది.

కళ్ళు పెద్దవయినాయి. మొహం ఎఱ్ఱబడింది.

'ఆ!.... నాకు బోలెడన్ని పాటలొచ్చు. రావని అబద్ధం చెప్పటం నాకే మాత్రం యిష్టంలేదు. వస్తే మాత్రం.... అవును పాడాల్సిందే!.... నేర్చుకున్నదెందుకు పాడటానికేగా!' అని ఆమెగారి ఉద్దేశం.... సభ్యత.... సంస్కారం వుండక్కర్లా.... దీంట్లో అసభ్యతేముందమ్మా అని మా అమ్మకూడా అంటుంది. అవునూ అదీ నిజమే! అసలు నేను నోరెత్తి మాట్లాడకూడదు. వాళ్లేమన్నా సరే. అన్నింటికి వదిగి వదిగి నమస్కారాలు చెయ్యాలి గామాలు నా మాటలవలనే ఆ సంబంధం కూడా తప్పిపోయిందని మా నాన్నగారి వుద్దేశం కూడా. అయితే పాపం ఆయన పైకి అనరు.... '

బుగ్గలు వెడల్పు చేసుకుంటూ, కనుబొమ్మలు యెగరేస్తూ మరీ మరీ తన కళ్ళల్లోనే కళ్లు పెట్టుకుని చూసుకుంటోంది.

అవునూ అతనట్లా అంటంలో తప్పేమీ లేదు. నా కళ్ళు చిన్నవే. ముమ్మాటికీ చిన్నవే. ఆ ముక్క మొదటే చెప్పరాదు. బారడేసి కళ్ళుగలదాన్నే చేసుకుని దాని మొహమే చూసుకుంటూ ఎదురుగా ఇరవై నాలుగు గంటలు కూర్చోమను.... ఏం చదువు చదివావు... ఉద్యోగం యేమన్నా చేస్తున్నావా. అడిగే వాళ్ళకు చెప్పేవాళ్ళు లోకువ.... ఈ ప్రశ్నలే నే వెయ్యకూడదు. ఆడపిల్లను.. అందులోనూ పెళ్లికావాలసినదాన్నేను.... మరే....

అహ్హహ్హా.... పెద్ద పెట్టున వెకిలిగా నవ్వుకుంది.

తన మొహం ఆ క్షణంలో తనకే చాలా వికృతంగా కనిపించింది. గంభీరంగా చూస్తోంది. పెదిమ విరిచింది. రెండు బుగ్గల్ని రెండు వేళ్ళతో నొక్కుకుంది. ముక్కు దూలం పైకి క్రిందకి కదిలించింది.

అట్లా చూస్తూ చూస్తుండగానే తళుక్కున ఎక్కడో అందం తొంగి చూసింది. ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ! అనుకుంటూ ఆశ్చర్యంగా అదేపనిగా చూస్తోంది. అద్దంలో చలనం లేదు. మొహం విప్పారింది. మరుక్షణంలోనే మొహం కురచబడిపోయింది.

అమ్మ దాస్తే మాత్రం దాగుతుందా! అమ్మ అభిమానంకొద్దీ యేవేవో అంటుంది. అమ్మకాదు మరి!

అవును....నేను అందంగా లేను. ఆ మాట నిజమే.... ఆ విషయం నాకూ తెలుసు! వాళ్ళు పనికట్టుకుని యింత

దూరం రావాలా యీ ముక్క చెప్పటానికి. పెళ్లి చూపులని పేరు. వాళ్ళు అడిగే ప్రశ్నలు చేసే చేష్టలు వేరు. ఇతరులకు గౌరవం యివ్వలేనివారు తాము గౌరవం పొందటానికి యెంత వరకు అర్హులో వాళ్ళు ఆలోచించుకోవాలి. ఈ ముక్క యింకోళ్ళచేత చెప్పించుకోవాల్సింది కాదు.

శరీరంలోకి వణుకు వచ్చేసింది. అసంతృప్తి తీవ్రంగా చెలరేగింది. జుట్టు పీక్కుని గిరగిర తిరుగుతూ అద్దాన్ని వెక్కిరిస్తూ నిలబడింది. అద్దం మళ్ళీ వెక్కిరించింది.

కళ్లు గట్టిగా మూసుకుంది.

"అమ్మాయి సునీతా యెంత అందంగా వున్నావమ్మా.... నిన్ను త్వరలో పెళ్లి కూతురిగా చూడాలని వుందమ్మా...."

ఏవిటి మావయ్య అట్లా అన్నాడు. నిజంగానే అన్నాడా! ఎగతాళికి అన్నడా! ఆయనేమి మాట్లాడినా రెండర్థాలు వచ్చేటట్లు మాట్లాడతాడు. కాదు.... నిజంగానే అన్నాడు. నా మీద అభిమానం కొద్దీ అన్నాడు. నా మీద కంటె ఆయన చెల్లెలి మీద ప్రేమకొద్దీ అని వుంటాడు.

సునీత తల వూగించేసింది ఓ విధమైన సంతృప్తిగా.

'ఛీ! అసలు నా అందాన్ని నేనే చూసుకోలేక పోతున్నాను. అలాంటప్పుడు మిగతావాళ్ళు యేదో అన్నారని నేను బాధపడటం యెందుకు! నేను అందగత్తెను కాదని నేనెందుకు అనుకోవాలి! అబ్బా! నేనట్లా అనుకోలేదే! ఆ మాటకొస్తే పావనికంటె యేమీ తీసిపోను. శారదతో పోల్చిచూస్తే చెప్పలేను గాని, కమలా నేనూ ప్రక్క ప్రక్కన నిలబడితే మా యిద్దరిలో అట్టే తేడా కన్పించదు....

పోలికలు తెచ్చుకుంటూ మనస్సంతా సంతోషంతో నింపుకుంది. మొహం కళకళలాడింది. తన ఆలోచనలో కొత్త మలుపు వచ్చినట్టు కనిపించింది.




నేను నేనుగా చూసుకుని అందచందాలు నిర్ణయించుకోక్కర్లేదు. నాకంటె అందమైనవాళ్లూ వున్నారు. నాకంటె అందవిహీనులూ వున్నారు. తనలో తాను గుణించుకుంటోంది. తాను వేసుకున్న ప్రశ్నకు మనస్సు మెచ్చిన సమాధానం వస్తోంది. ఆత్మవిశ్వాసం యెంతో కలిగింది. మనోధైర్యం వచ్చింది ఏదో కొత్త వెలుగు చూస్తున్నట్టుగా తనలో తాను తన్మయత్వం చెందుతోంది.

పెదిమలు వెడల్పు చేసుకుని కళ్లార్పకుండా అద్దంలోకి అట్టే చూస్తోంది.

ఒకమ్మాయి తన వెనకాలే నిలబడ్డట్టు హఠాత్తుగా కనిపించింది. ఇట్టే చప్పున వెనక్కు తిరిగింది.

మళ్ళీ ముందుకు తిరిగి అద్దంలోకి చూసింది.

తనకంటె పొడుగ్గావున్న అమ్మాయి తనకంటె ఎత్తుగా వెనకాల నిలబడి వున్నట్టుగా మళ్ళీ కనిపించింది.

ఏమిటీ యీ చిత్రం అనుకుంటూ వెనక్కూ ముందుకూ చూస్తోంది. తనలో తాను నవ్వుకుంది. ఇదంతా తన ఊహ. నిజానికి తన వెనకాల యెవ్వరూలేరు. అయితే అప్రయత్నంగా తన మనస్సులోకి వసంత వచ్చిన మాటవుతే నిజమే. ఆమె చాలా పొడుగ్గా వుంటుంది. సన్నగా వుంటుంది. చక్రాల్లాంటి కళ్ళు, కోల మొహం. ఎత్తుగావున్న బుగ్గలు. పల్చటి పెదిమలు. చిన్న ముక్కు. వత్తుగావున్న కనుబొమ్మలు. వెడల్పాటి నుదురు. చిరునవ్వు తొణికిసలాడుతూ మొహం. నుదురుమీద మధ్యలో ఎర్రటి బొట్టు. ఎంత నాజుకుగా వుంది అనుకుంది మనస్సులో. తనవితీరా అట్లాగే చూస్తూ నిలబడింది. బొమ్మలాగ ఆ అమ్మాయి కూడా తన వెనకాలే కదలక మెదలక నుంచుని వుంది. అద్దం చెప్తున్న సత్యం.

క్షణంలో కళ్ళు మూసుకుంది.

అందమంటే ఇవేమీకావు....

ఎక్కడో ధ్వని వినిపించింది. చెవుల మీద చేతులు అడ్డంపెట్టుకుంది.

ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉక్కిరిబిక్కిరై పోతోంది. శరీరమంతా ఊగిపోతోంది.

'బ్రహ్మదేవుడా! నాకు అందాన్ని యెందుకు ప్రసాదించలేదు....' ఉద్వేగంతో వెర్రిగా కేకపెట్టినట్లయింది. ఆయాసపడుతూ బిక్కుబిక్కుమంటూ

అటూ యిటూ చూసింది. తనలో తాను ఏదో సణుక్కుంటోంది.

'నువ్వు నన్ను అవమానించావు.... నలుగుర్లోనూ తలవంచుకునేటట్లు చేశావు. నేను చేసిన పాపం యేమిటి.... ఆ అందగాళ్ళంతా చేసిన పుణ్యం యేమిటి! ఈ తారతమ్యాలు యెందుకు కల్పించావు.... నేను నీకు యేమి అపకారం చేశాను. దీనురాలిగా నీ ముందు నిలబడి నిన్ను ప్రార్థిస్తున్నాను.... నాకేదైనా దారి చూపించు.

తెగ ఆరాటపడుతూ ఆవేదనగా ఏవేవో అనుకుంటోంది.

ఆమె చెవుల్లో గింగురుమంటూ శబ్దం మారుమోగింది. నాలుగు వైపుల్నుంచి వికటమైన నవ్వులు. పకపకలు. అట్టహాసాలు. చెవులు చిల్లులు పడిపోతున్నాయి. ఊగిసలాడిపోతోంది. రెండు చేతుల్తోనూ రెండు చెవులను అదిమిపెట్టి ఆ వికటాట్టహాసాలు వినిపించకుండా ప్రయత్నంచేస్తోంది.

క్షణంలో అమ్మయ్య అనుకుంటూ ఊరడిల్లుతోంది.

ఆయన చతుర్ముఖుడు. ఆయనకు నాలుగు నోళ్ళున్నాయి.

నాలుగు నాలుకలతో మాట్లాడగలడు. అంటూ ఊహించుకుంటుండగానే, అద్దంలో నాలుగు మొఖాల్తో బ్రహ్మ సాక్షాత్కరించాడు!

దేవదేవ నన్ను క్షమించు.... నా అజ్ఞానాన్ని మన్నించు.... చేతులు జోడించింది సునీత.

ఆయన మొహంలోకి తీక్షణంగా చూస్తూ నిలబడిపోయింది. ఆ అద్దంలోకి ఎంతోమంది వచ్చి వెళ్ళిపోతున్నారు. అట్లాగేచూస్తూ నిలబడిపోయింది. రామనాథంగారొచ్చి ఒక క్షణం నిలబడ్డారు. సృష్టి రహస్యాన్ని గురించి ఆయనిచ్చిన ఉపన్యాసంలో కొన్ని ముక్కలు సునీత చెవుల్లో దూరి చక్కిలిగింతలు పెడుతున్నాయి.

'....ఈ సృష్టి సామాన్యమైనదికాదు. సృజింపబడిన ప్రతి ప్రాణి ఒక నూతన సాధన, శారీరక సౌష్టవంలోనూ, మానసిక వికాసంలోనూ, బుద్ధి జ్ఞానంలోనూ విశిష్టమైన, విశ్లేషమైన భేదభావం ప్రతి వ్యక్తిలోనూ కొట్టచ్చినట్టు కనిపిస్తుంది. సృష్టిలో ఈ తరతమాలు సహజములు. ప్రకృతి సిద్ధములు....

సునీత బొమ్మలాగ నిలబడిపోయింది.

ఆ బ్రహ్మ మాట్లాడుతున్నట్లుగా అనిపించింది.

'అందరికీ కూడా సద్గుణాలు, సౌందర్య రేఖలు యిచ్చాను. అందరి మొహాలు తీర్చిదిద్దాను. అన్నిటికంటె అనంతమైన శక్తిని ప్రతి మానవునికి ప్రసాదించాను. దీంట్లో యే విధమైన భేదభావం లేదు. స్త్రీ పురుష భేదము అసలేలేదు. అయితే ఆ అనంతమైన శక్తి కొంతమందికి యిట్టే గోచరిస్తుంది. సద్వినియోగం చేసుకోగలుగుతారు. మరి కొంతమంది సాధన ద్వారా తెల్సుకోగలుగుతారు. ప్రయత్నించి ఆ శక్తి ఏమిటో తెలుసుకో.... నీలోవున్న ఆ శక్తే నీకు పరిపూర్ణత ప్రసాదిస్తుంది. ఆ శక్తే, అందమూ, బుద్ధీ, తేజస్సూ- అన్నీ కూడాను. నువ్వు ఆ ప్రయత్నమే చెయ్యకపోతే సోమరిపోతువయి ప్రతి నిత్యమూ నిన్ను నీవే అనేక రకాలుగా నిందించుకుంటూ కాలాన్ని వృథాచేస్తావు. కార్యోన్ముఖురాలివిగా ....లే.... అధైర్యపడొద్దు....'

బ్రహ్మ అద్దంలోంచి యిట్టే మాయమయిపోయాడు.

సునీత తెగ అలసిపోయింది. ఆయాసపడుతూ రొప్పుతూ పెద్దగా నిట్టూర్పులు విడుస్తోంది. కాసేపటికిగాని తెప్పరిల్లలేదు.

బిత్తరపోతూ ఆ గదంతా పచార్లు చేసింది. అక్కడ యెవ్వరూ లేరు. మళ్ళీ క్షణంలో అద్దంముందుకువచ్చి నిలబడింది. అద్దం అతి నిర్మలంగా వుంది. తన బొమ్మ ఒకటే కనిపిస్తోంది. అంతే! అయితే తన రూపానికి, అద్దంలో తాను చూసుకుంటున్న బొమ్మకు చాలా తేడా కనిపిస్తోంది. అద్దంలో బొమ్మ అందంగానూ ఆనందంగానూ కనిపిస్తోంది.

సునీతకు ఆత్మవిశ్వాసం — ధైర్యం యెన్నో యింతలు పెరిగిపోయినాయి

కళ్ళు పెద్దవి చేసుకుని ఒళ్ళంతా పెంచుకుని అద్దంలో తన రూపాన్ని చూసుకుంటోంది. తన కళ్ళను తానే నమ్మలేకపోతోంది. వొళ్ళంతా గగుర్పొడిచింది. వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది.

ఇంకా రామనాథంగారి ఉపన్యాసంలో భాగాలు గుర్తుకొస్తున్నాయి.

'....మానవులంతా ఒకటే.... బాహ్యంగా కనిపించే రూపురేఖల్ని గురించి మోసపోవద్దు.... అన్ని రకాల తెలివితేటలు, అందరికీ వున్నాయి. మానవుడు, భగవంతుని ఉనికిని పరీక్ష చెయ్యటానికి ఎన్నో ప్రయోగాలు చేస్తున్నాడు. విజ్ఞానశాస్త్రంలో యెంతో పురోగమించిన మానవుడు కేవలం శరీరాన్ని చూసి అంగసౌష్టవాన్ని చూసి మోహపడటంగాని, అసహ్యపడటంగాని కేవలం అవివేకము. అజ్ఞానము....'

సునీతకు ఆవేశం, ఉద్రేకం యెక్కువయిపోయినాయి. తనలో యేదో నూతన తేజస్సు ప్రవేశించినట్టు ఉప్పొంగిపోతోంది. పట్టలేని సంతోషం, ఆనందం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చప్పున కళ్లార్పుతూ నోరు తెరుచుకుని విడ్డూరంగా అద్దంలోకి చూసింది. గజగజలాడిపోతోంది. తెగ భయపడిపోతోంది.

అద్దంలో అస్థిపంజరం!

వెకిలిగా నవ్వుతూ వికటంగా ఊగుతూ భయపెట్టేస్తోంది.

మొహమంతా ఎముకలగుట్ట.ఒళ్ళంతా

ఎముకల కుప్ప. నాజూకుగా ముక్కు చోటుచేసుకున్న ప్రదేశంలో పెద్ద తొర్ర! నోటినిండా వరసగా తెల్లటి రాళ్ళు! చెక్కిళ్లేవీ! ఆ కళ్ళు రెండూ రెండు గుంటలు! పల్చటి పెదిమలు అసలు లేనేలేవు!

సునీత నిర్ఘాంతపడి నిలబడిపోయింది. వళ్ళంతా బరువెక్కింది. తల దిమ్ముగా వుంది. కళ్ళు మండుతున్నాయి. మొహం ముడుచుకుపోతోంది.

పెద్ద పెట్టున కేకపెట్టా లనిపించింది. ఆ అస్థిపంజరం నవ్వుతుంటే శరీరం గజగజలాడిపోతుంది. ఈ దృశ్యం భరించరానిది. మహా దారుణం. బిత్తరపోయి ఏమిచెయ్యాలో తోచక తత్తరపడిపోతోంది.

'.... మహా మహా అందగాళ్ళని విర్రవీగుతున్నవాళ్ళ అసలు రూపాన్ని నేను....'

ఈ మాటలు ఆమె చెవిలో ప్రవేశించి ఆమెను తికమకపెట్టేసినాయి. ఆ! అంటూ నివ్వెరపోయింది.

ఆ అస్థిపంజరం తనతో యేదో మాట్లాడుతున్నట్లుగా ఊహించుకుంటోంది.

'....అవును నిజాన్ని యింత బాహటంగా చూపించకూడదు. నిజాన్ని మరుగుపరుస్తూ అప్పుడప్పుడు బైట పెట్టటంలోనే సభ్యతా సంస్కారాలున్నాయి. అందరికీ తెలిసిన విషయమైనా గోప్యంగా వుంచటంలోనే అందమూ ఆనందమూ వున్నాయి. అందుకనే మానవులు అందమైన దుస్తులు ధరిస్తూ వుంటారు....


'ఆ!....'

'అవును. ఇప్పుడు నీ అందమైన శరీరంతో నన్ను కప్పేసెయ్యి....' అస్థిపంజరం యిట్టే మాయమయిపోయింది.

సునీత గుండెమీద చెయ్యి పెట్టుకుని



అప్పు జనతా పార్టీ మనిషి చేతిలో చిమ్ని బుడ్డి పట్టుకుని వెలిగించాడని మీరు చేతిలో తుపాకాయి వెలిగించటం ఎందుకు చేసారండీ!!




నిబ్బరంగా గంభీరంగా చూస్తోంది. కొంచెం సేపటికి తెప్పరిల్లింది.

తనను తాను క్రిందనుంచి పైదాక చూసుకుంది. మనస్సులో రకరకాల ఆలోచనలు చెలరేగినాయి. అద్దమంతా తన రూపంతో నిండిపోయింది. తన సౌందర్యానికి తాను ముగ్ధురాలయి పోతోంది. అద్దంలో తన నగ్నరూపం కనిపించింది. మరుక్షణంలో అస్థిపంజరం అద్దంలో మెరిసింది. ఒళ్ళు ఝల్లుమంది గుండె గుభేలుమంది. మళ్ళీ తనను తాను చూసుకుంది. ఎంతో సంతృప్తి, ఆనందం ఆమె మొహంలో వెల్లివిరిసినాయి.

మనస్సు ప్రధానం. మనోఫలకం మీద యే ముద్రపడితే అదే కళ్ళల్లోకి వచ్చి కూర్చుంటుంది. అంతే.

సునీత బుర్ర వేడెక్కింది. తల దులుపుకుంటూ జుట్టు చిక్కు తీసు కుంటోంది. దువ్వెన్న పళ్ళల్లోకి తన మెత్తటి నల్లటి జుట్టు యిరుక్కుపోయి రానంటోంది. ఎట్లాగయితే బలవంతంగా చిక్కు విడదీసి, జుట్టు ముడివేసుకుంది ఆ ముడి విడిపడి యిట్టే పాయలు పాయలుగా చీలింది. ఆ పొడుగాటి జుట్టును భుజంమీద వేలాడదీసి చేత్తో తాకుతూ అతి నాజూకుగా సుతారంగా మూనెతో మెల్లిగా అద్దుతోంది. జుట్టు మెరుస్తూ తళతళ మంటోంది. మెల్లి మెల్లిగా జడ అల్లుకుంటోంది. ఆ అల్లికలో తన ఆలోచనలన్నీ చిక్కుకు పోతున్నాయి. ఆ జడ పొడుగా వేలాడుతూ తన భుజంమీద నుంచి క్రిందకు చూస్తోంది. తన కాలికి మెత్తగా యేదో తాకినట్లు అనిపించి అదిరిపడింది. ఒళ్ళు గలతరించింది. అది తన జడే! బుసలుకొడుతున్నట్లుగా కనబడ్డ ఆ నల్లటి పొడుగాటిది త్రాచుపాము కాదు. అది కేవలం తన జడే. తన పరధ్యానానికి తానే విడ్డూరపడింది.

అబ్బ! ఎంత ధడుచుకున్నాను! ఇంత అందంగావున్న నా జడ నన్నే భయపెట్టేసింది. ఒక క్షణంలో నన్ను యెంత హడలు కొట్టేసింది అనుకుంటూ ఆశ్చర్యపోయింది.

'అమ్మాయి.... విన్నావా.... ప్రకాశం గారబ్బాయికి నువ్వు నచ్చావుట....' తల్లి తబ్బిబ్బులయి, అమాంతం వచ్చి సునీతను చుట్టేసుకుంది. ఆమె నోట మాట లేదు. పరవశురాలయిపోయింది.

ఇదిగో మామయ్యా రాసిన ఉత్తరం అంటూ కూతురికిచ్చింది.

సునీత ఉత్తరాన్ని గబగబ చదువు తోంది.

ఆ ఉత్తరం అంతా తనను పొగడం తోనే నిండిపోయింది.

ముత్యాల్లాంటి అక్షరాలట తన దస్తూరి తన మాటల్లో చమత్కారం సమయ స్ఫూర్తి వున్నాయిట. ఇంత పెద్ద చదువు చదివినా, తన వినయవిధేయతలకు వాళ్ళు ముగ్ధులయిపోయారుట.

మామయ్య చాలా చాలా రాశాడు అనుకుంది.

అర్థవంతమైన అక్షరాలు ఒకదాని ప్రక్కన ఒకటి చేరి సునీతకు ఆదరంగానూ ఆప్యాయంగాను పల కరిస్తున్నాయి. ఆమె తెగ మురిసి పోతోంది.

సుధీర్ ఆ క్షణంలో తన కళ్ళల్లోకి వచ్చి కూర్చున్నాడు. తనను పల కరిస్తున్నట్టుగా తబ్బిబ్బులయిపోతోంది.

అతను ఒక్క ప్రశ్న వెయ్యలేదు. తాను అడిగి తెలుసుకోవాలనుకున్న వన్నీ అమ్మే టూకీగా చెప్పేసింది. నేను చనువుగా మాట్లాడటం వాళ్ళకేమి యెబ్బెట్టుగా లేదు. ముభావంగా చూసి వెళ్ళిపోయారు. తనను గురించి తన కంటె వాళ్ళే యెక్కువగా తెలుసు కున్నారు. తనలో తాను ఏవేవో ఊహించుకుంటోంది సునీత.

చప్పున వెళ్ళి అద్దంముందు నిల బడింది. కళ్ళు పెద్దవి చేసుకుని మరీ మరీ చూస్తోంది. తాను పొట్టిగా వున్నట్లుగా కనిపించటంలేదు. శరీరం, ఛాయ అద్దంలో అసలే తెలీటంలేదు.

పొర్లుకొస్తున్న ఆవేశాన్ని అణచుకో లేకపోయింది.

'అమ్మా! నేనూ అందంగానే వున్నానే!....' ఎంతో గంభీరంగా అన్నది సునీత.

ఆమె తల్లి కళ్ళు చెమ్మగిలినాయి ఆనందంతో.